క్లుప్తంగా

మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి వినాయక ప్రతిమలతో సభ్యులు

బీచ్‌రోడ్డు: నగరంలో ప్రజలందరూ పర్యావరణ హితంగా మట్టి ప్రతిమలతో వినాయక చవితి పండగను జరుపుకోవాలని పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా విశాఖపట్నం చాప్టర్ చైర్మన్, హెచ్‌పీసీఎల్ పీఆర్వో ఎం.కాశీ వరాహ లక్ష్మీనరసింహం ఆకాంక్షించారు. సొసైటీ, రోటరీ విశాఖ పోర్ట్ సిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్కే బీచ్ కాళీమాత దేవాలయం సమీపంలో ప్రజలకు 1,200 మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాశీ మాట్లాడుతూ పర్యావరణ హితంగా, ఆనందంగా ప్రజలు వినాయక చవితి వేడుకలు జరుపుకునేందుకు ఉచితంగా మట్టి ప్రతిమలు అందించామన్నారు. వీటితోపాటు హెచ్‌పీసీఎల్ సామాజిక సహకారంతో వస్త్ర సంచులను ప్రజలకు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌ఐ విశాఖపట్నం చాప్టర్ సెక్రటరీ గోవిందరావు, ప్రతినిధులు ఎస్.నాగేశ్వరరావు, నరసింహం, దివాకర్ ఎస్.సాంబశివరావు, రాజశేఖర్, కె.రఘు, రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ ప్రెసిడెంట్ కె.వెంకటరమణ, రోటరీ ప్రతినిధులు ఎస్ఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట



లీలాసుందరయ్యనగర్‌లో పందిరి రాట వేస్తున్న స్థానికులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు లీలాసుందరయ్యనగర్‌లో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాల నిర్వహణకు సిద్ధమయ్యారు. గురువారం వినాకయ చవితి పందిరి రాటను వేశారు. కార్యక్రమంలో లీలా సుందరినగర్ గ్రామ అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు, కర్రి సూర్యనారాయణ రెడ్డి, వాసు, అప్పలరాజు, సాయి, కార్తీక్, అనంత్, సూర్య, తరుణ్, కొండలరావు, రాధిక తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



గాంధీనగర్‌లో ర్యాలీ చేస్తున్న మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లతో కలిసి కాలనీలో ర్యాలీ చేశారు. పౌష్టికాహారంపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అతిథులు యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిరణ్ లలిత, డాక్టర్ నళిని, డాక్టర్ సాహిత్య మాట్లాడుతూ ఎటువంటి పౌష్టికాహారం తినాలి, వాటివల్ల ఉపయోగాల గురించి వివరించారు. పోషకాహారం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి పోషకాలతో కూడిన ఆహారం అవసరమన్నారు. పోషకాలతో కూడిన పిండి వంటలు తయారు చేసిన స్థానిక మహిళలకు బహుమతులుగా వివిధ రకాల స్టీల్ పాత్రలు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు ఆర్.శంకరరావు, డి.సాయిరాం, కె.యుస్నా, ఆర్.స్వాతి, వెంకటరత్నం, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బమ్మిడి రమణ కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. అతడి వైద్యం నిమిత్తం షిర్డీసాయి ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో డ్రైవర్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడాల గోవింద్ చేతుల మీదుగా గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. స్టాండ్ అధ్యక్షుడు లంకా గోవింద్, కార్యదర్శి సోములు, కోశాధికారి ఎస్.అప్పలనాయుడు, గౌరవ అధ్యక్షుడు గణేష్, శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గురుదేవోభవ

- విద్యాలయాల్లో వేడుకగా ఉపాధ్యాయ దినోత్సవం
- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి



తోటగరువు ప్రాథమిక పాఠశాలలో సీనియర్ టీచర్లను సత్కరిస్తున్న తోటి ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుల వేషధారణలో ఆకట్టుకున్న సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ: దేశ తొలి ఉపరాష్ట్రపతి, ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన సర్వపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం విద్యాలయాల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలోని పాఠశాలలు పిల్లల సందడితో కళకళలాడాయి. విద్యార్థులు టీచర్ల వేషధారణలో తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠాలు బోధించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంతపాలెం, తోటగరువు, పెదగదిలి, దీన్‌దయాళ్‌పురం, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, ఆపరేషన్ కాలనీ, అంబేడ్కర్ నగర్, గాంధీనగర్, జోడుగుళ్లపాలెం తదితర ప్రాథమిక పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలు జల్లి నివాళులర్పించారు. సీనియర్ టీచర్లను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

ఉత్తమ ప్రిన్సిపాల్ విజయబాబుకు సత్కారం

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ గుర్తింపు కలిగిన నైపుణ్యాలు, సామర్థ్యాల పాలనా సంస్థ ఉత్తమ ప్రిన్సిపాల్–2024 అవార్డుకు ఎంపికైన కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబును అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల కృషి వల్లే తనకు ఈ అవార్డు వచ్చిందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అకడమిక్ కో ఆర్డినేటర్ డి.శ్రావణ్‌కుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ప్రతాప్, పి.ఉమామహేశ్వరరావు, శామ్యూల్ డేవిడ్ రాజ్, బి.లక్ష్మి, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

- 15వ వార్డు పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక వ్యక్తి కర్రి శివకుమార్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ మార్గదర్శకులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–12 కిడ్జ్ గార్డెన్ పబ్లిక్ స్కూల్‌లో టీచర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- లెబన్‌హిల్స్ దివ్యాంగుల పాఠశాలలో ముఖ్య అతిథి బ్రహ్మకుమారీ రమ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సమాజాన్ని ఉన్నతంగా నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాల డైరెక్టర్ లక్ష్మీసూర్యశ్రీ, పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. స్కూల్ చైర్మన్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.
- ఎంవీపీ కాలనీ సెక్టార్–7లోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో ఏవీఎన్ కళాశాల మాజీ వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వరరావును సత్కరించారు. ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు, విశిష్ట సేవలందిస్తున్న 30 మంది అధ్యాపకులను లయన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ ఆధ్వర్యంలో సత్కరించారు. నిర్వాహకుడు కండిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో సర్వేపల్లి జయంతి

మహారాణిపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆర్ట్స్ కాలేజీ వద్ద ఉన్న సర్వేపల్లి విగ్రహానికి ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏయూలో ఉపకులపతిగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చూపిన మార్గం, దార్శనికతను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్.రాజు, కె.సీతామాణిక్యం, గిరిజా శంకర్, పద్మశ్రీ ఎన్.విజయమోహన్, నాగరాజు కుమారి, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, డీన్‌లు, అధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఆచార్య శాంతమ్మకు సన్మానం

మహోన్నత వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ నడయాడిన ఏయూలో పనిచేయడం, చదువుకోవడం ఎంతో గర్వకారణమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. ఏయూ ఫ్యాకల్టీ క్లబ్ ఆవరణలో రిటైర్డ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. నేటికీ ఉత్సాహంగా బోధన వృత్తిలో కొనసాగుతున్న ఏయూ భౌతిక శాస్త్ర విశ్రాంత ఆచార్యులు సిహెచ్.శాంతమ్మను సత్కరించారు. విశ్రాంత ఆచార్యులు సాంబిరెడ్డి, ఆచార్య బల్ల అప్పారావు, ఆచార్య కె.విశ్వనాథం, వివిధ విభాగాల ఆచార్యులు పాల్గొన్నారు.



పరమేశ్వరరావును సత్కరిస్తున్న వీఎంసీ ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు



ఏయూలో సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ శశిభూషణరావు



కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబును సత్కరిస్తున్న అధ్యాపక బృందం

ఏయూ విభాగాల్లో..

అల్లిపురం: ఏయూ ఐఏఎస్ఈ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. డి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



లెబన్‌హిల్స్ డైరెక్టర్ లక్ష్మీసూర్యశ్రీని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీ రమ తదితరులు



సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐఏఎస్ఈ ప్రతినిధులు



రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ విదేశీ విద్యార్థులు

- తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏయూ అభివృద్ధికి తోడ్పడిన రీతి' అనే అంశంపై అతిథి ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ప్రసంగించారు. ఒడిశా నవరంగ్‌పూర్‌కు చెందిన పూర్వ కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్.బెహరా, ఆచార్య ఎం.వి.కృష్ణయ్య, పూర్వ ఆచార్యులు వై.వి.సత్యనారాయణ, వానపల్లి వెంకటరావు పాల్గొన్నారు.
- ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో విదేశీ విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఏయూ సెట్ డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య పి.విశ్వనాథం సర్వేపల్లి చిత్రపటానికి నివాళి అర్పించారు. విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు.
- ఏయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ వెంకటేశ్వర్లు, డా.ఈశ్వరమ్మ, డా.లావణ్య, డా.వెంకటస్వామి, డా.రత్నశేఖర్, డా.గిరీష్‌కుమార్, పరిశోధకులు స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందిస్తున్న కర్రి శివకుమార్



నృత్య ప్రదర్శనలో కిడ్జ్ గార్డెన్ బాలికలు

మాతృ మరణాలు సంభవించరాదు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. గురువారం సాయంత్రం రేసపువానిపాలెంలో ఉన్న కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆగస్టులో రైల్వే న్యూకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒకటి, స్వతంత్ర నగర్–1 పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో మరొకటి జరిగాయన్నారు. వీటికి సంబంధించి వివరణ ఇవ్వాలని డీఎంహెచ్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డీఐవో) డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ పి.ఉష, గైనకాలజిస్టులు డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, డాక్టర్ ఆర్.డి.ఎస్.శ్వేత, కేజీహెచ్ ఎనస్థీషియా డాక్టర్ టి.వి.శ్రీకృష్ణ, జనరల్ మెడిసిన్ డాక్టర్ బి.వర్ణిక, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ అధికారులు జి.శారదాదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు, మెడికల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు 150 దరఖాస్తులు

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక మండపాల ఏర్పాటుకు గురువారం నాటికి 150 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయి. వాటిని త్రీటౌన్ సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న వారు నగదు చెల్లించిన రసీదు పట్టుకొని స్టేషన్‌కు చేరుకొని అనుమతులు పొందుతున్నారు. వినాయక మండపాల ఏర్పాటులో స్థానికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ పార్థసారథి తెలిపారు. గురువారం వినాయక మహోత్సవాల కమిటీ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులుగా మంచి ప్రవర్తన కలిగిన వారు మాత్రమే ఉండాలన్నారు. ఉత్సవాలకు రౌడీషీటర్లను దూరంగా ఉంచాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత సౌండ్స్ నిలిపివేయాలని, నిరంతరం ఇద్దరు మండపాల వద్ద ఉండాలని సూచించారు.


వర్సిటీలో క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యం



ఏయూ అధికారులతో సమావేశమైన వీసీ ఆచార్య శశిభూషణరావు

మహారాణిపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ అధికారులతో సమావేశ మందిరంలో గురువారం సమీక్ష నిర్వహించారు. బుధవారం రాత్రి జరిపిన ఆకస్మిక తనిఖీలపై అధికారులతో మాట్లాడారు. హాస్టల్స్‌లో తనిఖీలకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని నియమిస్తామన్నారు. ఇకపై ఆకస్మిక తనిఖీలు నిరంతర ప్రక్రియగా జరుపుతామన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి నడవడిక పెంపొందిస్తూ, నాణ్యమైన విద్యను అందించడం తమ లక్ష్యమన్నారు. ఏయూను ర్యాగింగ్ రహితంగా, డ్రగ్ ఫ్రీ క్యాంపస్‌గా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. ఈ ప్రక్రియలో రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పోలీస్ క్వార్టర్స్‌లో మౌలిక వసతులు ప్రారంభం



పోలీసు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

బీచ్‌రోడ్డు: చినవాల్తేర్ పోలీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. 79950 95799 నంబర్‌కు గత వారం పోలీసు కుటుంబ సభ్యుల నుంచి మౌలిక వసతుల వినతుల అందాయి. లైటింగ్, సీలింగ్ లీకేజీ, పాడైన డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలను సంబంధిత అధికారులకు తెలిపి త్వరితగతిన మరమ్మతులు, ఇతర చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. సీసీ టీవీ కెమెరాలను కూడా నిర్ణీత సమయంలో ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీకి పూల తోరణాలతో ఆహ్వానం పలికిన పోలీస్ కుటుంబ సభ్యులు తమ సమస్యలను విని సత్వరం అన్ని వసతులను సమకూర్చిన సీపీ బాగ్చికి ధన్యవాదాలు తెలిపారు. మరమ్మతులకు ముందు తరువాత చిత్రాలను పరిశీలించి, నూతన వసతుల ప్రారంభ అనంతరం సీపీ ఇతర సమస్యలపై ఆరా తీయగా.. క్వార్టర్స్‌కు ఫెన్సింగ్ వాల్ ఏర్పాటు చేయమని, నీరు నిల్వ ఉంచే సంపు సైజు పెంచాలని, క్వార్టర్స్‌కు పెయింటింగ్ వేయించమని కోరగా.. కమిషనర్ సానుకూలంగా స్పందించారు.


ఏయూను సందర్శించిన ఆస్ట్రేలియా బృందం



ఆస్ట్రేలియా ప్రతినిధులు స్వాతి, ఆంటోనీలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

మహారాణిపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆస్ట్రేలియా కార్నర్‌ను నెలకొల్పే దిశగా ఆస్ట్రేలియా ప్రతినిధుల బృందం గురువారం ఏయూను సందర్శించింది. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులతో గవర్నమెంట్ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్ అండ్ ట్రేడ్ విభాగం బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ స్వాతి బాలసుబ్రమణియన్, ఆంటోని జోసఫ్‌లు వీసీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏయూలో ఆస్ట్రేలియా కార్నర్ ఏర్పాటు చేయడం వల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు, స్నేహం బలోపేతమవుతాయని, బిజినెస్–ట్రేడ్ రంగాల్లో సహకారం, విద్య, పరిశోధన అంశాలు, వివిధ విశ్వవిద్యాలయాలతో ఎంవోయూలు చేసుకోవడం సాధ్యపడుతుందని వివరించారు. తద్వారా భారతీయ విద్యార్థులు ఆస్ట్రేలియాలో, అక్కడి విద్యార్థులు భారత్‌లో చదువుకోవడానికి అవకాశాలు ఉంటాయన్నారు.

వరద సహాయ నిధికి రూ.70 లక్షల సాయం



ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహరావుకు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అల్లిపురం: వరదల కారణంగా నష్టపోయిన విజయవాడ ప్రజలను ఆదుకునేందుకు ఏయూ నుంచి పలువురు ముందుకొచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ టీచింగ్, నాన్–టీచింగ్, రిటైర్డ్ టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆచార్య బల్ల అప్పారావు, పెన్షనర్స్, నాన్–పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నొడగల అప్పారావు, సెక్రటరీ నాగశేఖర్, చైర్మన్ సైదయ్య, టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆచార్య జాలాది రవి, గుంటుబోయిన రవికుమార్, పెద్దిరెడ్ల అప్పలరాజు, వీసీ ఆచార్య శశిభూషణ్, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావును గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ఫర్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కు యూనివర్సిటీ నుంచి సుమారు రూ.70 లక్షలు ఇవ్వడానికి అన్ని సంఘాల నుంచి వినతిపత్రం అందజేశారు.

త్వరలోనే త్రీ టౌన్ పీఎస్ మరమ్మతులు

బీచ్‌రోడ్డు: శిథిలావస్థలో ఉన్న మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌పై 'రక్షకులకు భద్రత కరువు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి స్పందించారు. వారం రోజుల్లో పోలీస్ స్టేషన్ మరమ్మతు పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సీఐ పార్థసారథి మేస్త్రీని రప్పించి మరమ్మతుల అంచనా వేయించారు. అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

విద్యుత్ స్తంభాలు పక్కకు జరిపిస్తాం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌ను అనుకొని పెదగదిలి కూడలి నుంచి తోటగరువు వెళ్లే మార్గంలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌ స్తంభాలను త్వరలో మార్చనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడ ఇటీవల నిర్మించిన కొత్త రోడ్డు మధ్యలో హై ఓల్టేజీ తీగలతో కూడిన విద్యుత్ స్తంభాలు వాహన చోదకులకు ఇబ్బందిగా మారాయి. దీనిపై 'రోడ్డు నిర్మించారు.. స్తంభాలు మరిచారు' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను పక్కకు జరిపించడానికి ఎస్టిమేషన్ వేసినట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. దీనిని జీవీఎంసీ అధికారులకు పంపించామన్నారు. ఎస్టిమేషన్ ప్రకారం జీవీఎంసీ అధికారులు నిధులు చెల్లించిన వెంటనే ఇక్కడ స్తంభాలను జరిపించే ప్రయత్నంలో ఉన్నట్లు చెప్పారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోటీలో పోషకాలతో కూడిన వంటకాలు ప్రదర్శిస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: జాతీయ పోషకాహార దినోత్సవంలో భాగంగా గురువారం పెదజాలరిపేటలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తీసుకోవాల్సిన అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ మానిటరింగ్ ఆఫీసర్ సురేంద్ర మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. రోజు వారి జీవితంలో తగినంత విశ్రాంత ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలకు పలు పోషకాహార వంటకాల పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు సంస్థ ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.